# పోలింగ్ ప్రశాంతం

- వరంగల్ జిల్లాలో 80.70.. హనుమకొండ జిల్లాలో 66.38 శాతం పోలింగ్
- మందకొడిగా ప్రారంభమై ఊపందుకున్న పోలింగ్
- ఓటింగ్ సరళిని పరిశీలించిన కలెక్టర్లు ప్రావీణ్య, సిక్తా పట్నాయక్
- బందోబస్తును పర్యవేక్షించిన సీపీ అంబర్ కిశోర్ ఝా

వరంగల్, నవంబర్ 30(నమస్తేతెలంగాణ) : జిల్లాలో శాసనసభ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. చెదురు ముదురు ఘటనలు మినహా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగలేదు. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. ఆరంభంలో మందకొడిగా సాగిన పోలింగ్ తర్వాత ఊపందుకుంది. సాయంత్రం ఐదు గంటల వరకు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకోవడం కనబడింది. ఓటు హక్కు వినియోగించుకోవడంలో ఓటర్లు ఉత్సాహం కనబరిచారు. సాయంత్రం ఐదు గంటల్లోగా పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించిన ఓటర్లకు అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు. దీంతో పలు కేంద్రాల్లో రాత్రి పొద్దుపోయేవరకు పోలింగ్ కొనసాగింది. జిల్లాలోని మూడు శాసనసభ నియోజకవర్గాల్లో 80.70 శాతం పోలింగ్ నమోదైంది. అత్యధికంగా నర్సంపేట నియోజకవర్గంలో 87.89శాతం పోలింగ్ జరిగింది. వర్ధన్నపేటలో 80.22, తూర్పు నియోజకవర్గంలో 74 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో గురువారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభించారు. మొదట పోలింగ్ కేంద్రాల వద్ద అంతంత మాత్రంగా కనపడిన ఓటర్లు తర్వాత బారులు తీరారు. గ్రామీణ ప్రాంతాల్లో సాయంత్రం పోలింగ్ ముగిసే వరకు ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి క్యూలో ఉన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు, యువత పోటెత్తారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం ఎన్నికల అధికారులు వాహనాలను సమకూర్చారు. పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులు, ట్రైసైకిళ్లు, తాగునీరు, విద్యుత్ సరఫరా వంటి వసతులు కల్పించారు. పట్టణ ప్రాంతాల్లోని పలు పోలింగ్ కేంద్రాల్లో మధ్యాహ్నం వరకు ఓటర్లు లేక బోసిపోయాయి. మధ్యాహ్నం 3 గంటల తర్వాత తూర్పులోని పలు పోలింగ్ కేంద్రాలు ఓటర్లతో కిటకిటలాడాయి.

### క్రమేనా పెరిగిన పోలింగ్ శాతం..

జిల్లాలో పోలింగ్ శాతం క్రమేనా పెరిగింది. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు జిల్లాలో 8.60 శాతం పోలింగ్ నమోదైంది. నర్సంపేటలో 11.5, వరంగల్‌తూర్పులో 5, వర్ధన్నపేటలో 9.50 శాతం పోలింగ్ జరిగింది. ఉదయం 11 గంటల వరకు పోలింగ్ శాతం 18.73కు పెరిగింది. మధ్యాహ్నం 1 గంట వరకు 37.25 శాతం పోలింగ్ నమోదైంది. మధ్యాహ్నం 3 గంటల వరకు 52.28 శాతానికి చేరింది. సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ శాతం 73.04 శాతం నమోదైంది. 2018 శాసనసభ ఎన్నికల్లో జిల్లాలో 73.37 శాతం పోలింగ్ నమోదైంది. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పర్వతగిరిలోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ వరంగల్ పెరికవాడలో తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. నల్లబెల్లిలో ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, వరంగల్ పెరికవాడలో ఎమ్మెల్సీ నన్నపునేని నరేందర్, వరంగల్ మండిబజార్‌లో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ పడిశాల వీరభద్రయ్య బాలికల ఉన్నత పాఠశాలలో మేయర్ గుండు సుధారాణి ఓటు వేశారు. కలెక్టర్ ప్రావీణ్య హనుమకొండ రాజ్‌పుత్ వాడలోని ఓ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. మంత్రి ఎర్రబెల్లి రాయపర్తి మండలంలో, నర్సంపేట, వర్ధన్నపేట, వరంగల్‌తూర్పు నియోజకవర్గాల బీఆర్‌ఎస్ అభ్యర్థులు, ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, అరూరి రమేశ్, నరేందర్ తమ నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు.

### ఆకట్టుకున్న ప్రత్యేక కేంద్రాలు..

ప్రతి నియోజకవర్గంలో ఎన్నికల అధికారులు ఈ సారి మహిళలు, దివ్యాంగులు, యువత కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలు ఓటర్లను విశేషంగా ఆకట్టుకున్నాయి. వీటిని సుందరంగా తీర్చిదిద్దారు. మహిళా పోలింగ్ కేంద్రాల్లో పూర్తిగా మహిళా అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తించారు. ఓటర్లకు స్వాగతం పలికేలా ఆహ్వాన బ్యానర్, ఎంట్రన్స్ నుంచి గ్రీన్ కార్పెట్ ఏర్పాటుతో పాటు బెలూన్లతో అలంకరణ, అన్ని టేబుళ్లను వస్త్రంతో కప్పి ఉంచడం, పిల్లలు ఆడుకోవడానికి ఆట బొమ్మల ఏర్పాటు, మహిళా పోలీసు సిబ్బందికి ఏకరూప దుస్తులు, ప్రత్యేకంగా ఫీడింగ్ రూం, పోలింగ్ కేంద్రంలో రంగవల్లులు, సెల్ఫీ పాయింట్, వాష్ రూం వంటివి ఏర్పాటు చేశారు. జిల్లా ఎన్నికల అధికారి ప్రావీణ్య కొత్తవాడలోని గోల్డెన్ ఓక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన మహిళా పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. జిల్లాలో సమస్యాత్మకమైనవిగా గుర్తించిన 161 కేంద్రాల్లో కేంద్ర పోలీసు బలగాలు బందోబస్తు విధులు నిర్వర్తించాయి. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. సీపీ అంబర్ కిశోర్ ఝా దుగ్గొండి, వర్ధన్నపేట మండలాల్లోని వివిధ పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఏసీపీలు బోనాల కిషన్, సతీశ్‌బాబు, తిరుమల్, రఘుచందర్ బందోబస్తును పర్యవేక్షించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రక్రియను వెబ్‌కాస్టింగ్ ద్వారా కలెక్టర్ ప్రావీణ్య, ఆర్వోలు పరిశీలించారు. పోలింగ్ ముగిసిన తర్వాత అధికారులు, సిబ్బంది ఈవీఎంలను వరంగల్ ఎనుమాములలోని వ్యవసాయ మార్కెట్, నర్సంపేట నియోజకవర్గంలోని ఈవీఎంలను నర్సంపేట వ్యవసాయ మార్కెట్ గోదాము వద్దకు చేర్చారు. డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు జరుగనుంది.


వడ్డేపల్లిలోని పింగిళి కాలేజీలోని పోలింగ్ కేంద్రంలో క్యూలో ఓటర్లు


న్యూశాయంపేట ప్రభుత్వ స్కూల్ కేంద్రంలో ఓటు వేసేందుకు వస్తున్న ఓటర్లు

### హనుమకొండ జిల్లాలో..

హనుమకొండ : వరంగల్ పశ్చిమ, పరకాల నియోజకవర్గాల్లో ఓటింగ్ ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. శాసనసభ ఎన్నికల ప్రక్రియను హనుమకొండ కలెక్టరేట్ నుంచి ఆమె పర్యవేక్షించారు. జిల్లాలో సాయంత్రం 5గంటల వరకు 63.38 శాతం పోలింగ్ జరిగిందని ఆమె చెప్పారు. పశ్చిమ నియోజకవర్గంలో ఉదయం 9గంటల వరకు 7శాతం, 11గంటల వరకు 17.23శాతం, మధ్యాహ్నం ఒంటి గంట వరకు 30.44 శాతం, మూడు గంటల వరకు 41.87 శాతం, సాయంత్రం 5గంటల వరకు 53 ఓటింగ్ శాతం నమోదైంది. పరకాల నియోజకవర్గంలో ఉదయం 9గంటల వరకు 6.74 శాతం, 11 గంటల వరకు 26.25 శాతం, మధ్యాహ్నం ఒంటి గంట వరకు 41.56 శాతం, సాయంత్రం 3గంటల వరకు 58.23 శాతం, సాయంత్రం 5గంటల వరకు 83.76శాతం ఓట్లు పోలైనట్లు తెలిపారు.

### కేంద్రాలకు సందర్శించిన సీపీ..

సుబేదారి/వర్ధన్నపేట, నవంబర్ 30 : వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని 1128 పోలింగ్ కేంద్రాల వద్ద 4వేల మంది పోలీసు సిబ్బంది, 1700 మంది కేంద్ర బలగాలు ఎన్నికల విధుల్లో పాల్గొన్నారు. సీపీ అంబర్ కిశోర్ ఝా హనుమకొండలోని మర్కజీ స్కూల్, దుగ్గొండి మండలం, వర్ధన్నపేట పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈవీఎంలను తరలించే వరకు అప్రమత్తంగా ఉండాలని సీఐ శ్రీనివాస్, ఎస్సై ప్రవీణ్‌కుమార్‌కు సూచించారు.

## ఓటేసేందుకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదం

**ఏడేళ్ల బాలిక మృతి.. తండ్రికి తీవ్ర గాయాలు**

శాయంపేట, నవంబర్ 30 : ఓటు వేసేందుకు బైక్‌పై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటన శాయంపేట మండలం గోవిందాపూర్ గ్రామ సమీపంలో గురువారం జరిగింది. దీంతో ఏడేళ్ల చిన్నారి అక్కడికక్కడే దుర్మరణం చెందింది. ఎస్సై దేవేందర్ కథనం ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా నేరేడుపల్లి గ్రామానికి చెందిన బోడకుంట్ల రాంబాబుకు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కూలి పని చేసుకుంటూ హనుమకొండ ఏనుగులగడ్డ ప్రాంతంలో రాంబాబు కుటుంబం నివసిస్తున్నది. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు రాంబాబు, భార్యతో కలిసి బైక్‌పై బయలు దేరాడు. భార్య, చిన్న కూతురును ములుగురోడ్డు వద్ద బస్సు ఎక్కించాడు. పెద్ద కూతురు వైష్ణవిని బైక్‌పై ఎక్కించుకుని ఇద్దరు వస్తుండగా గోవిందాపూర్ ఈఆర్‌ఆర్ క్రషర్ వద్ద ఎదురుగా గుర్తు తెలియని వాహనం వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో చిన్నారి వైష్ణవికి తీవ్ర గాయాలు కాగా, అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. రాంబాబు తలకు తీవ్ర గాయాలు కావడంతో వరంగల్‌కు తరలించగా, వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. ఓటేసేందుకు సొంతూరుకు వెళ్తున్న సందర్భంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని చిన్నారి మృతి చెందడం గ్రామస్తులను తీవ్రంగా కలచివేసింది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★రామకృష్ణ గ్రూప్ (AP, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. వృద్ధుల/పేషెంట్ల సేవకు వర్కర్లను 24x7 మీ ఇంటికి పంపగలము. 9281452762, 9515108830.
NT-314461

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
9182777213
WARANAGAL
9182777556
9182777557
9182777558
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

## ఓటేసిన అరగంటలోనే అనారోగ్యంతో వృద్ధుడి మృతి

సంగెం, నవంబర్ 30 : ఓటేసిన అరగంటలోనే వృద్ధుడు అనారోగ్యంతో మృతిచెందిన ఘటన మండలంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగెంకు చెందిన సింగారపు ఎల్లయ్య(65) మధ్యాహ్నం ఓటేసి ఇంటికి వెళ్లాడు. అరగంట తర్వాత తనకు దాహం వేస్తున్నదని చెప్పాడు. కుటుంబసభ్యులు నీళ్లు తాగిపిస్తున్న క్రమంలో మృతిచెందాడు. మృతుడికి భార్య సూరమ్మ, నలుగురు కుమార్తెలు ఉన్నారు.


ఎల్లయ్య

## రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

గీసుగొండ, నవంబర్ 30 : రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని కొమ్మాల శివారులోని వరంగల్ నర్సంపేట ప్రధాన రహదారిపై గురువారం సాయంత్రం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపురం మండలం రంగంపేట గ్రామానికి చెందిన వాంకుడోత్ రవీందర్ వరంగల్‌లో ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు భార్య మానస, పిల్లలు చైతన్య, హర్షవర్ధన్‌తో కలిసి సొంత గ్రామం రంగంపేటకు వెళ్లారు. ఓటు హక్కు వినియోగించుకొని సాయంత్రం తిరిగి తమ ద్విచక్రవాహనంపై వరంగల్‌కు వస్తున్న క్రమంలో కొమ్మాల ఆర్చిగేటు వద్ద వరంగల్ నుంచి నర్సంపేటకు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి ఎదురుగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 ద్వారా క్షతగాత్రులను వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతున్నారు. మానస ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు ఆమెను హనుమకొండలోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనం నుజ్జునుజ్జయింది. కారు రోడ్డు పక్కన బోల్తా పడడంతో అందులో ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి.

## సీఐ ఓవరాక్షన్

- కుడా చైర్మన్ కార్యాలయంపై రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ దాడి
- ప్రశ్నించిన చైర్మన్ డ్రైవర్‌ను చితకబాదిన ఉదయ్‌భాస్కర్

నయీంనగర్, నవంబర్ 30 : హనుమకొండ రాంనగర్‌లోని కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ కార్యాలయంలోకి రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఉదయ్‌భాస్కర్ చొచ్చుకొని వచ్చి సిబ్బందిని దుర్భాషలాడాడు. ఇదేంటని ప్రశ్నిస్తే 'అరే నువ్వేంది నాకు చెప్పేది.. నన్నే అడిగే దమ్ముందా.. ఇక్కడ ఏం చేస్తున్నారని దురుసుగా అడిగాడు. వెంటనే డ్రైవర్ సార్ ఇది ఆఫీస్.. ఎందుకు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. మీకు ఏమైనా సమాచారం ఉంటే వెళ్లి చెక్ చేసుకోండి.. అని సమాధానం చెప్పగా, కోపోద్రిక్తుడైన సీఐ లాఠీతో ఇష్టం వచ్చినట్లు కొట్టాడు. గాయాలపాలైన డ్రైవర్‌ను హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించినట్లు తెలిసింది.

### న్యూశాయంపేటలోనూ అదే తీరు..

న్యూశాయంపేటలో కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ బీఆర్‌ఎస్ కార్యకర్తలతో ఓటింగ్ మంచిగా జరిగేట్టు చూడండి.. వృద్ధులకు సహాయం చేయండి అని చెప్పే క్రమంలో సీఐ ఉదయ్‌భాస్కర్ అక్కడికి చేరుకుని ఇక్కడ ఏమి చేస్తున్నారు. మీరు చదువుకున్న వారేనా? అని దురుసుగా మాట్లాడాడు. అక్కడే ఉన్న కొంతమంది ఓటింగ్ కేంద్రానికి తాము చాలా దూరంగా ఉన్నామని, నిబంధనలను ఉల్లంఘించలేదని, తెలుసుకోకుండా ఎందుకు అలా మాట్లాడుతున్నావ్ అంటూ తిరగబడ్డారు. అక్కడే ఉన్న సుందర్‌రాజ్ యాదవ్ సర్ది చెప్పడంతో గొడవ సద్దుమణిగింది.

### సీఐ ప్రవర్తనపై చర్చ..

జిల్లాలో శాసనసభ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎక్కడా కూడా గొడవలు జరుగలేదు. అయితే సీఐ ప్రవర్తన చర్చనీయాంశమైంది. ఇలా చేయాల్సిన అవసరం ఏముందని పలువురు చర్చించుకుంటున్నారు. కాగా, తన కార్యాలయంపై దాడి చేసిన రిజర్వ్ సీఐ ఉదయ్‌భాస్కర్‌పై చర్యలు తీసుకోవాలని ఈసీకి ఫిర్యాదు చేసినట్లు కుడా చైర్మన్ తెలిపారు.


కుడా చైర్మన్ కార్యాలయ సిబ్బందితో వాగ్వాదం చేస్తున్న సీఐ ఉదయ్ భాస్కర్